# అతీతుడు

ఎందుకూ పనికిరాడని మూల పారవేసిన గోడగడియారానికి మళ్ళీ ప్రాణం పోసి గోడమీద స్థిరంగా యీనాటికీ ప్రేలాడేట్టు చేసిన చలపతినీ, విరుల పెండ్లినాడు వూరేగింపున తెచ్చినకారు చెడిపోతే, యిట్టే అయిదు నిముషాల్లో బాగుచేసి వూరేగింపుకు సిద్ధంచేసిన చలపతినీ, మా బంధుకోటిలోని యావన్మందీ, వీడు ఏ యింజనీర్లో అవుతాడనే అన్నారు. కాని ఎవ్వరూ వూహించనట్టుగా చలపతి ఓ హైస్కూలు టీచరయ్యాడని విన్న నాకు ఎంతో ఆశ్చర్యం వేసినమాట వాస్తవం.

ఇప్పటికీ ఒక చేత్తో పుస్తకాలుపట్టుకుని, రెండోచేత్తో నిక్కరు పైకిలాక్కుంటూ పరుగెత్తే కుర్రాణ్ని చూస్తే చలపతి నా స్మృతిపథంలోకి వస్తాడు. రేడియో విప్పదీసుకుని తదేకంగా చూస్తూ తీగలు కలిపే రేడియో యింజనీరుని చూస్తే చటుక్కున చలపతి నా మస్తిష్కంలో మెదిలి మాయమౌతాడు.

కాని...విధి!... జీవిత సోపానాల్ని అధిగమించి ఉన్నతోన్నత శిఖరాల్ని అందుకోవాల్సిన కుర్రాడు బడిపంతులై పోయాడని విన్నప్పుడు నా గుండె ఒక్కసారి పూడి క్రిందపడ్డట్లయింది. దీనికి కారణం తండ్రి మరణం, చెల్లెలి వివాహసమస్య, తమ్ముళ్ళ చదువులూ అని తెలిసినపుడు చలపతిమీద కించిత్ కోపం వచ్చిందికూడా. ఆత్మీయులమో దగ్గరివాళ్ళం మేమింతమంది వున్నాం గదా! కొంతంతా సహాయం చేయమా ... వాడు అభివృద్ధిలోకివస్తే మాకుమాత్రం ఆనందం కాదా!

నాకెందుకో ఒక్కసారి చలపతిని కలుసుకోవాలనీ, వాడి నుంచి వివరాలు తెలుసుకోవాలనీ, వాడి కష్టాలలో కొంత పాలు పంచుకోవాలనీ అనిపిస్తోంది: కాని, తీరా వాడిదగ్గరకెళితే నన్ను వాడు సరిగా అర్థం చేసుకుంటాడా? ... ఇంతకు ముందు అనే వాడు నాతో "బంధువులకన్నా స్నేహితులే నయం బాబాయ్," అని. మరి నేనూ బంధువునే. నా హృదయం చలపతంటే పొంగి పోతుంది. సర్వకాలాల్లోనూ వాడికోసం పలకరిస్తుంది. వాడికి నా సర్వస్వం ధార పోయాలనిపిస్తుంది... కాని, వాడికి నేనంటే ఆ అభిప్రాయం వుందో లేదో తెలుసుకోవాలని నాకెప్పుడూ అనిపించదు మరి.

* * *

నిత్యజీవితంలో కొన్ని కొన్ని కార్యాలు నెరవేర్చాలనుకుంటుంటాం. అవి కొంత ముఖ్యమైన కార్యాలే కావచ్చు. కాని ఆ పనులు చేయాలంటే ఎందుకో బద్ధకం ఆవరిస్తుంది. గంటలతరబడి పేవ్ మెంటుమీద నిల్చుని వృథాగా మాటాడమంటే అలాగే మాట్లాడుతుంటాను. ఊరికే పైకప్పుకేసి చూస్తూ మంచంమీద అలాగే పడుకోమంటే ఆనందంగా పడుకుంటాను. కాని అర్ధాంగి బజారునుంచి కాఫీ పొడుం తెమ్మంటే ఒక్కసారిగా బద్ధకం ఆవహిస్తుంది. చంటివాణ్ణి ఆస్పత్రికి తీసుకెళ్ళమంటే ఎక్కడలేని విసుగూ జనిస్తుంది.

## ఆర్. వి. జి. కృష్ణమూర్తి

చలపతివద్దకు నేను బయలుదేరి వెళ్ళడం కూడా కారణమేమీ లేకుండానే క్రమ క్రమంగా మూలపడిపోతూంది. 'పోనీ, ఓ ఉత్తరమైనా వ్రాస్తాం' అనుకునేవాణ్ణి. కాని కట్టుకున్న ఆశాసౌధా లన్నీ పేక మేడల్లా కూలద్రోసుకున్న వ్యక్తిని, ఒక్కసారిగా జీవితంలో గొప్ప పరాజయం పొంది బాధపడుతున్న వ్యక్తిని, నేరుగా వెళ్ళి పరామర్శించకుండా ఒక్క కాగితం ముక్కతో ఓదార్చబూనడం ఆ వ్యక్తి ఆత్మగౌరవాన్ని న్యూనతపరచడమే.

* * *

ఈ నెలలో తప్పక చలపతివద్దకు వెళ్ళి తీరాలని నిశ్చయించుకున్నాను. నేను వస్తున్నానని ముందుగా తెలియజేయకుండా వెళ్తేనే వాడి నిజస్వరూపం నాకు అవగాహన అవుతుంది. అందుకనే వాడికి ముందుగా నేను వస్తున్నానని ఉత్తరం వ్రాయలేదు.

నా పెళ్ళయిన క్రొత్తల్లో యిలాగే చెప్పా పెట్టకుండా మా అత్తగారింటికి వెళ్ళాను. సరిగా నేను యింట్లో ప్రవేశించే సరికి, మామగారు అరుగుమీద కూర్చుని జంధ్యాలు వడుకుతున్నాడు. అత్తగారు విస్తరాకులు కుడుతూంది. పెద్దబావమరిది గొడ్డలితో కట్టెలు చీలుస్తున్నాడు. ఇక మా శ్రీమతి వళ్ళంతా నూనె పట్టించుకుని స్నానానికి తయారవుతూంది. ఆనాడు మా అత్తగారింట్లో వారి అంతస్తులు నే చక్కగా గ్రహించేసానోనని అందరూ ఎక్కడలేని కంగారు పడ్డారు. నాకెంతో బాధ వేసింది తర్వాత.

తీరా ట్రెయిన్ స్టేషను సమీపిస్తూండగా నాకో సందేహం వచ్చింది—అసలు చలపతి వూళ్ళో వుంటాడో వుండడో-అని.

రైలు దిగి కుర్రాళ్ళ సాయంతో చలపతి యిల్లు చేరుకున్నాను. అది యిల్లులా లేదు. ఎలిమెంటరీ స్కూల్లాగా వుంది. కొందరు కాగితాలు కత్తిరిస్తున్నారు. కొందరు అట్టలకు ఏవో అంటిస్తున్నారు. కొందరు బొమ్మలు గీస్తున్నారు...ప్రపంచ పటాలు, భారత దేశ పటాలు, దేశనాయకుల చిత్రాలూ... ఏవేవో గీచేస్తున్నారు. వాటికి రంగులు పులుముతున్నారు మరి కొందరు.

నారాకను కూడా గమనించలేదు చలపతి. లోపల్నుంచి రాధ వచ్చింది"

"రా, బాబాయ్! ఎప్పుడూ రావడం!" అంది. చలపతి చెల్లెలు రాధ. ఎప్పుడో చూశాను. ఇప్పుడు బాగా ఎదిగింది. అంతా తల్లిపోలిక. తల్లీ దండ్రీ లేని లోటు తీర్చగల అన్నయ్య చలపతి ఆప్యాయతలో తీర్చి దిద్దబడిన కుసుమం సందేహంలేదు. కాళ్ళు కడుక్కొనేందుకు నీళ్ళిచ్చి, "అన్నయ్యా బాబాయి వచ్చాడు," అంది చలపతితో. కొద్దిగా తలెత్తి చూచి కూర్చో బాబాయ్ రెండు నిముషాల్లో వస్తాను" అన్నాడు.


శతమూలికాదిలేహ్యము

5 భస్మములు 100 మూలికలు చేరినది. సెగ సవాయి మున్నగు సుఖవ్యాధులు, మేహ పొద, పుచ్చులు, పుండ్లు మాన్పి రక్తం శుభ్రపరచి బలము నరముల పటుత్వం కల్గించును. స్త్రీల బుతుబాధలు అమిత నొప్పి నష్టసంతానము నివారించి సంతానం కల్గించును లేటలాగు, సలహా ఉచితము.

శ్రీ భుజంగరావు వైద్యశాల

తాళ్ళరేవు - తూర్పుగోదావరి.

# అతీతుడు

బాగా చిరాకేసింది నాకు. రాకరాక ఇంత వాడ్ని పనిగట్టుకుని నేనే వాడు కుశలప్రశ్నలు వేసే పద్ధతి యిది. ఎప్పుడూ యింతే. బంధువులంటే పడదు వాడికి. నేనూ బంధువునేగా.

కుర్చీలో కూర్చున్నాను. రాధ కాఫీ తెచ్చిచ్చింది. చలపతి కుర్రాళ్ళకేదో చెప్పి లేచివచ్చాడు.

"ఏం బాబాయ్. ఉత్తరం ముక్కైనా లేకుండా వూడిపడ్డావ్" అన్నాడు నవ్వుతూ.

ఆ నవ్వులో ఎంత వ్యధ దాగివుందో వర్ణించలేను. "మాస్కూల్లో ఇంకో రెండు రోజుల్లో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. అందుకనే యీ శ్రమంతానూ," అన్నాడు.

* * *

ఆ రాత్రి భోజనాలైన తర్వాత యిద్దరం కూర్చున్నాము.

"రాధ పెళ్ళిప్రయత్నాలేమైనా చేస్తున్నావా?" అన్నాను.

"కల్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారుగదూ బాబాయ్ మీ బోటివాళ్ళంతా," అన్నాడు నిబ్బరంగా. వాడి మాటలో యింత పెద్దవాడివీ, ఆప్తుడివీ, నీవుండీ, దాని పెళ్ళివిషయంలో ఏమాత్రం సాయంచేయకుండా అంతా నామీదే వదిలేశావే! అనే అర్థం నాకు స్ఫురించింది. నామీద దెబ్బతీశాడు! నిజం. అందుకు నేనర్హుడినే. కాకుంటే యిన్నాళ్ళకు వాడ్ని పరామర్శించేందుకు వచ్చానే.

చిన్నపిల్లలిద్దరూ నిద్రపోయారు. రాధ యింట్లో ఏదో చక్కబెట్టుకుంటూంది.

"ఏం చలపతీ? నీకొచ్చే జీతంలో కాపురం ఎలా నెట్టుకొస్తావ్? అమ్మాయ్ పెళ్ళెలాచేస్తావ్?" అన్నాను.

"ఏదో ఓ విధంగా అన్నీ చేయాలి బాబాయ్" అన్నాడు. వాడి ముఖంలో దిగులుగాని, దుఃఖంగాని గోచరించలేదు. అదేవాడిలో ప్రత్యేకత. మనసువిప్పి ఎవరితోనూ చెప్పుకోడు. కనీసం మనసులోని బాధలైనా ముఖంమీద గోచరింపనీయడు.

ప్రొద్దున్నే లేచాను.

అప్పటికే చలపతి కాలకృత్యాలు తీర్చుకుని నిప్పులు చెంబులోపోసి బట్టలు యిస్త్రీ చేసుకుంటున్నాడు.

ఆదృశ్యం చూట్టంతోనే నాకళ్ళు చెమర్చినయి. అలాగే చూస్తూ నిల్చుండిపోయాను.

"ఏం బాబాయ్ ఆశ్చర్యంగా వుందా? ఇలాచేస్తే బట్టలు చాలాకాలం వుంటాయి గదూ" అన్నాడు.

నేను కాలకృత్యాలు తీర్చుకొనేలోగా చలపతి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

రాధ చెప్పింది-ట్యుటోరియల్ కాలేజిలో ఓగంట పాఠం చెబుతాడట. నెలకు ముప్ఫయి రూపాయలిస్తారట. మళ్ళీ ఎనిమిదిన్నరకు చలపతి యింటికి వచ్చేలోగా ముగ్గురు కుర్రాళ్ళు కాచుక్కూర్చున్నారు. వాళ్ళకు తొమ్మిదిన్నరవరకూ ట్యూషన్ చెప్పాడు. వాడితో ఏవేవో విషయాలు మాట్లాడాలనుకున్నాను. కాని తీరికేదీ? నాలుగు మెతుకులు కొరికి స్కూలుకెళ్ళాడు. మధ్యాహ్నం రాధ చెప్పింది, "మళ్ళీ అన్నయ్యరాక రాత్రి ఎనిమిదికే," అని.

"అప్పటివరకూ ఏం చేస్తుంటాడమ్మాయ్" అన్నాను.

"సాయంస్కూలయిపోయిం తర్వాత ఓ బట్టల షాపులోనూ, ఓ హోటల్లోనూ లెక్కలు వ్రాసి పెడతాడు" అంది రాధ.

నాకు పెద్దగా ఏడుపొచ్చినంత పనయింది. నా కడుపులో ఎవరో చెయ్యిపెట్టి దేవినట్లయింది.

పెద్దల చాటున నిశ్చింతగా విద్యాభ్యాసం చేసుకుంటూ కాలం గడపాల్సిన యువకుడు యిలాంటి యాంత్రిక జీవితానికి బానిసైపోయాడు.

* * *

ఆ రాత్రి పదిగంటలకుగాని చలపతి యింటికి రాలేదు.

"నీవు భోంచేయకూడదా బాబాయ్. నా కోసం కాచుక్కూర్చోవడం ఎందుకు? రేపు ఇన్‌కంటాక్సు వాళ్ళకు అకౌంట్సు పంపాలిట. అందుకనే యింతాలస్యమైంది" అన్నాడు చొక్కా విప్పుతూ చలపతి.

నేను మౌనంగా వింటూ కూర్చున్నాను. రోజంతా పనిచేసినా వాడిలో విసుగుదల గాని, అలసటగాని కనుపించలేదు.

"వెధవది. యీ దొంగలెక్కలు వ్రాయాలంటే నా మనస్సు వెనక్కిలాగుతుంది బాబాయ్. కాని ఏంచేస్తాం' అన్నాడు.

"యీ లెక్కలు వ్రాసేకంటే మరో నలుగురు కుర్రాళ్ళకి ట్యూషన్ చెప్పుకుంటే పోదూ" అన్నాను.

"మంచిదే బాబాయ్. కాని మ్యానేజిమెంటు నాకు ముగ్గురికే అనుమతిచ్చింది. అంతకంటే ఎక్కువమందికి చెప్పటం మ్యానేజిమెంటును మోసంచేసినట్టవుతుంది."

అంతటితో ఆ సంభాషణ ఆపేశాను.

భోంచేసేప్పుడు అప్రయత్నంగా అనేశాను, "పెళ్ళెప్పుడు చేసుకుంటావురా?" అని.

చలపతి కళ్ళలో కొంచెం తీవ్రత కనుపించింది.

"మా బ్రతుకంటే నీకూ వేళాకోళంగా వుందా బాబాయ్" అని తల దించుకున్నాడు.

ఆప్రశ్న వేసినందుకు తర్వాత కెంతో బాధపడ్డాను.

"మరి రాధ పెళ్ళో?"

"రాధపెళ్ళి చేస్తాను. చేసేవరకూ నాకు విశ్రాంతివుండదు" అన్నాడు కొంచెం తీవ్రంగానే.

"ఏవైనా సంబంధాలు వస్తున్నాయా?"

"డబ్బులేందే సంబందాలొచ్చి ప్రయోజనమేముంది బాబాయ్. డబ్బు సమకూర్చుకొందే ఆ ప్రయత్నం చెయ్యాను. ఇంతకూ

(63 వ పేజీ చూడుడు)

* హైదరాబాదుకు వచ్చినపుడు మమ్ముల మరచిపోకండి!
* పోస్టు పార్శలులో తాము కోరిన మిఠాయిలు పంపబడును.
(By Appointment to His Excellency The Governor Of Andhra)
జి. పుల్లారెడ్డి
అచ్చమైన నేతి మిఠాయిల్లో నేర్పు గలవారు.
శ్రీ వెంకటేశ్వర బేకరీ, ప్రొప్రయిటర్. హెచ్. ఓ. కర్నూలు.
బ్రాంచి: స్టేషన్ రోడ్, (అబిద్ సర్కిల్) హైదరాబాద్ (ఏ. పి.)

# అతీతుడు

(16 వ పేజీ తరువాయి)

మా రాధ అదృష్టవంతురాలు. అడిగిందే తడవుగా ట్యుటోరియల్ కాలేజిలో వుద్యోగమిచ్చారు. కాఫీహోటల్లోనూ, బట్టల షాపులోనూ కూడా కొద్దిగా వస్తుంది" నవ్వాలని ప్రయత్నించి కొద్దిగా నవ్వాడు చలపతి.

"కాని అబ్బాయ్ ఇలా విశ్రాంతి లేకుండా పనిచేయడంవల్ల నీఆరోగ్యం దెబ్బతింటుందని నీకు తెలుసనుకుంటాను."

"తెలుసు బాబాయ్. నేను బ్రతకాల్సిన రోజుల్లో సగంరోజులే బ్రతుకుతాను. కాని నాకు చింతలేదు. రాధపెళ్ళి కావాలి. తమ్ముళ్ళిద్దర్నీ ఒకదరికి లాక్కురావాలి." అన్నాడు ఆవేశంతో.

అప్పటివరకూ నాకు అక్కడ మూడో వ్యక్తి వున్నదన్న విషయం జ్ఞప్తికిరాలేదు. రాధవంక చూచాను. ఆమె చెంపలపై కన్నీరు ప్రవహిస్తున్నది.

"రేపు వుదయమే వెళ్తాను చలపతీ" అన్నాను యిక ఆసంభాషణ అంతం చేయాలనే తలపుతో.

"సరే బాబాయ్ అప్పుడప్పుడొచ్చి పోతూవుండు" అన్నాడు.

ఇంకా రెండురోజులుండి వెళ్లుబాబాయ్ అంటాడని భావించిన నాకు ఆశాభంగమైంది.

నాకారాత్రి సరిగా నిద్రపట్టలేదు.

రాధ పెళ్ళివిషయంలోగాని, పిల్లల చదువుల విషయంలోగాని నాసహాయం, కనీసం నాసలహాయైనా అర్థించలేదు చలపతి. అసలు 'నేను' నే వ్యక్తి వాడికోసం తహతహలాడుతుంటానని, వాడికోసం ఏ త్యాగమైనా చేసేందుకు సర్వకాలాల్లో సిద్ధంగా వుంటాననీ వాడు గ్రహించనే లేదు.

బాబాయ్! నువ్వు నాకీ విషయంలో తప్పక సహాయం చేయాలి అన్నమాట వాడి నోటంట వింటే యీ ప్రయాణం నాకెంతో తృప్తికరంగావుండేది.

* * *

ఊరికిబయల్దేరేముందు వంటింట్లోకెళ్లాను. జేబులోంచి అయిదు పదిరూపాయల నోట్లు తీసి "ఇవి వుంచుకో అమ్మాయ్," అన్నాను రాధతో.

"ఎందుకు బాబాయ్ యివి" అంది.

"అలాకాదు. తీసుకో అమ్మా! ఇంతకంటే యీ బాబాయ్ నీకేమివ్వగలడు? నీకిష్టమైన చీరకొనుక్కో అమ్మాయ్" అని బలవంతంగా చేతిలో పెట్టేశాను.

నాకళ్ళు నీళ్ళతో నిండాయి. గొంతులో అపస్వరాలు పలికాయి. రాధ చెంపలపై నుంచి అశ్రువులు జలజల రాలాయి.

"వస్తానమ్మా. మీకు ఏకష్టమొచ్చినా యీ బాబాయి ఒకడున్నాడని మాత్రం మరచిపోకు తల్లీ. ఒక కార్డుముక్కతో యిక్కడ వాల్తాను. సరేనా." అన్నా నాకన్నీరు ఆమెకు కనిపించకుండావుండేందుకు ప్రయత్నిస్తూ.

ఈ మాటలు రాధతో కాబట్టి అనగలిగాను అదే చలపతితో అనగలనా?...

స్టేషనువరకూ చలపతివచ్చాడు. బండికి ఇంకా ఓ అరగంట టైముంది. మళ్ళీ చలపతి వెళ్ళిపోవాలి.

"రైలు వచ్చేవరకూ ఎందుకు చలపతీ నువ్విక్కడ?"

"సరే. వస్తాబాబాయ్" అన్నాడు నిర్లిప్తంగా.

"వెళ్ళిరా చలపతీ...ఒక్క మాట.... నువ్వెప్పుడూ డబ్బుకోసం బాధపడకు. నీకెప్పుడే అవసరమొచ్చినా నాకు వ్రాస్తావు కదూ!" అన్నాను గుండెలు బిగబట్టుకుని.

"అంత అవసరం ఎప్పుడూ వుండదు బాబాయ్."

"ఒక్కమాట చలపతీ—రాధ పెళ్ళికి తక్షణం ప్రయత్నించు. ఏవైనా సంబంధాలు నేనూచూస్తాను" అన్నాను.

"వీలేదు. ఇంకా కొన్నాళ్ళాగడమందే రాధపెళ్ళిగాదు" అన్నాడు చలపతి దూరాన వెడుతున్న ఇంజనునుచూస్తూ.

"సర్వదా నీక్షేమాన్ని ఆశించేవాణ్ణి నేనొకణ్ణి వున్నానన్న విషయం ఎప్పుడూ విస్మరించకు చలపతీ! నీకెంత డబ్బు కావలసినా నన్నడిగేందుకు సంకోచించకు."

"అసంభవం బాబాయ్! నీ డబ్బుతో యీరోజు రాధపెళ్ళి, జేసే రేపు తమ్ముళ్ళ చదువుల కెవరు సహాయంజేస్తారు? నాన్న చనిపోయేప్పుడు రాధ పెళ్ళిచేసి, తమ్ముళ్ళను పైకితీసుకొస్తానని ప్రమాణంచేశాను. నాన్నకిచ్చినమాట నెరవేర్చుకోనీ! నా రక్తంతో వాళ్ళను ప్రయోజకులుగా చేశాననే తృప్తి నాకు మిగలనీ బాబాయ్. నాకు జీవితంమీద నమ్మకముంది. జీవితంలో సాధించరానిదంటూ ఏమీలేదనే విశ్వాసముంది...అంతకంటే ఏంలేదు. నీ కోరిక నిరాకరించినందుకు క్షమించు......వస్తా." అంటూ త్వరగా పెదపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు చలపతి.

* * *

దుక్కలాగుంటే ఓ మధ్యవయస్కుడు "ధర్మం బాబూ" అంటున్నాడు. దూరాన ఓ పెద్ద మనిషి బుకింగ్ ఆఫీసువద్ద టిక్కెట్లుకొనేవాళ్ళ జేబులను పరిశోధిస్తున్నాడు. ముప్ఫయిఏళ్ళ దొంగసన్యాసి ఒకడు టికెట్ కలెక్టర్ కంటబడకుండా రైలెక్కేందుకు నానా తంటాలు బడుతున్నాడు.

వీళ్ళంతా జీవితమంటే భయపడుతున్న వ్యక్తులుగాదా! పనిచేసుకొను శక్తి, అవకాశంవుండీ, అడ్డదారులు తొక్కి జీవితగమనాన్ని సులువుచేసుకునేందుకు పాటుబడుతున్నారీవ్యక్తులు. దూరాన రోడ్డుమీద మలుపు తిరుగుతున్న చలపతి కనుపించాడు. నిజంగా చలపతి సమర్థుడు, కార్యశూరుడు, అతీతుడు!...అలాంటివ్యక్తి నాకు బంధువుగా వున్నందుకు నా హృదయం ఒక్కసారిగా వుత్సాహభరితమైంది. చెప్పలేని అనుభూతి కలిగింది.

రైలింకా రాలేదు. టైము చూచుకున్నాను. కాని నా నేత్రాలోంచి జలజల రాలిన ఆనందాశ్రువులు వాచీముళ్ళను కనబడకుండా చేశాయి. ★


